www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 18 నవంబరు 2022



సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ఈనెల 21వ తేదీ సోమవారం నరసాపురం నియోజకవర్గంలో సిఎం పర్యటన సందర్భంగా ఏర్పాట్లను గురువారం కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. హెలీప్యాడ్, వాటర్ గ్రిడ్, ఆర్‌టిసి బస్టాండ్, ప్రభుత్వ హాస్పిటల్, సిఎం సభ జరిగే ప్రాంతాన్ని ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం ప్రారంభించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, తహశీల్దార్ ఎండి ఫాజిల్, అధికారులు ఉన్నారు.

జ్ఞానం పెంచుకోవడానికే సోషల్ మీడియా

డాక్టర్ జంగం రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

సోషల్ మీడియా ద్వారా అనేక రకాల ప్రయోజనాలు ఉన్నప్పటికీ యువతను కొంత చెడు మార్గంలోకి నడిచేలా కారణమవుతుందని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు డాక్టర్ జంగం రాజేంద్రప్రసాద్ అన్నారు. అందులో మంచిని మాత్రమే తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలను, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను గురువారం ఎపి బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజేంద్రప్రసాద్ బాలికలనుద్దేశించి మాట్లాడారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివిన అనేక మంది విద్యార్థినులు ఉన్నత స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. బాలికలు అనేక రకాలుగా వేధింపులకు గురవుతున్నారని, వారి పరిరక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటి అమలు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సహించకూడదన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌రైట్స్ జిల్లా సభ్యులు వైవి.రాజు, విద్యాకమిటీ ఛైర్మన్ డి.ఈశ్వరరావు (లోకేష్), వైస్ ఛైర్మన్ పి.శాంతి, అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పి.అరుణ, వైస్ ప్రిన్సిపల్ పి.సుజాత, అంబేద్కర్, పీడీ కె.విజయలక్ష్మి, మహిళా కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఆర్థిక సుస్థిరతకు తోడ్పాటునివ్వాలి

పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కోన శశిధర్

ప్రజాశక్తి - ఏలూరు

మహిళా సంఘాలు మరింత ఆర్థిక అభివృద్ధి చెంది సుస్థిర ఆదాయం సాధించేలా తోడ్పాటును అందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ సూచించారు. జగనన్న భుహక్కు, రీసర్వే నిర్వహణ, జాతీయ ఉపాధి హామీ, జగనన్న స్వచ్ఛ సంకల్పం, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పనులు జిల్లాల్లో మరింత వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు నూరుశాతం గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సకాలంలో పనులు గ్రౌండింగ్ జరగాలన్నారు. ఇప్పటి వరకు పెండింగ్లో ఉన్న వాటిపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించి జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ప్రజలను చైతన్యవంతులను చేసి గుడ్డ సంచుల వాడకానికి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించి పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జిల్లా పంచాయతీ అధికారి ఎన్.బాలాజీ, డ్వామా పీడీ రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చర్మ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఏలూరు

చర్మ వ్యాధులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ సుబ్బారావు చెప్పారు. బాలల దినోత్సవ, బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర గృహంలో చర్మవ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ డెర్మటాలజీకి సంబంధించి చర్మవ్యాధులపై అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. హేలాపురి చైతన్య లయన్స్ క్లబ్ వారి సౌజన్యంతో చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ డి.సుబ్బారావు బాలుర వసతి గృహంలోని బాలురకు చర్మవ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హోమ్ పర్యవేక్షణాధికారి బివి.మురళీధర్, వైద్యాధికారి డాక్టర్ పి.కిషోర్, ఉప పర్యవేక్షణాధికారి జివిఎల్.సత్యనారాయణరావు, హేలాపురి చైతన్య లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్‌పర్సన్ వి.సత్యనారాయణ, సెక్రటరీ ఎ.వేణుగోపాల్, సభ్యులు ఎ.నాగగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు ఉత్పత్తికి కృషి చేయాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రతి రైతూ నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేసేందుకు కృషి చేయాలని పొగాకు బోర్డు విస్తరణ విభాగం మేనేజర్ జి.దామోదరం అన్నారు. గురువారం స్థానిక పొగాకు బోర్డు వేలం కేంద్రంలో పొగాకు పంట, ఉత్పత్తి యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం ప్రాంతీయ అధికారి జివిఎల్‌కె.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదరం మాట్లాడుతూ నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయడంతోపాటు పొగాకు పంట సంరక్షించుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి ఎం.గ్రేస్ మార్గరెట్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బసవరాజు, ఎన్‌ఐపిహెచ్‌ఎం సైంటిఫిక్ ఆఫీసర్ దామోదరాచారి పాల్గొన్నారు.



కంకరను తవ్వి తరలిస్తున్న జెసిబిలు, లారీలు

సూరంపూడి గట్టు సాగుదారులకు భూమి ఇవ్వాలి

సిపిఎం

ప్రజాశక్తి - టి.నరసాపురం

సూరంపూడి గట్టు సాగుదారులకు పంట నష్టపరిహారంతోపాటు భూమికి భూమి ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో సూరంపూడి లో బాధితుల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బొర్రంపాలెం రెవెన్యూ పరిధిలోని సూరంపూడి గట్టులో సుమారు వంద ఎకరాలకుపైగా గిరిజనులు, దళితులు భూమిలేని పేదలు పోడు కొట్టి గట్టుపై జీడి మామిడి, నిమ్మ, కొబ్బరి తదితర పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. 2003, 2008 సమయంలో అధికారులు పేదలకు పట్టాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారని, ఆ భూముల్లో మోటార్ బోర్లు కూడా ఉన్నాయని అన్నారు. అయితే గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరుతో రైతులకు ఎటువంటి సమాచారమూ లేకుండా భూమి హక్కుదారులకు నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా అడవిని పంటను పాడుచేసి గట్టును, రాళ్ల మట్టిని గ్రీన్‌ఫీల్డ్ హైవేకు రోడ్డు నిమిత్తం జెసిబిలతో, లారీలతో మట్టి రాళ్ళు తొలగిస్తున్నారని వాపోయారు. దీనిపై రైతులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా పరిష్కరించలేదన్నారు. ఒకపక్క మండలంలో పలుచోట్ల ప్రభుత్వ భూమిలో గట్టు మీద పోడు చేసుకుని పంటలు వేసుకుంటే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వారికి సాగుపత్రాలు మంజూరు చేయాలంటే 45 సంవత్సరాల నుంచి అనేకసార్లు ప్రజాప్రతినిధులను అధికారుల చుట్టూ తిరిగినా పట్టాలు లభించలేదన్నారు. పట్టాలున్నచోట భూమిలో సాగులో ఉన్నచోట సూరంపూడి గట్టుతోపాటు అబ్బుల్లాపురం గట్టు, వేపుగుంట గట్టును కూడా గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరుతో ధ్వంసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సూరంపూడి గట్టులో భూమి హక్కుదారులకి భూమికి భూమి, పంటలకు పరిహారం, బోర్లకు బోర్లు వెంటనే పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల కమిటీ సభ్యులు అనుమోలు మురళి, మడకం సుధారాణి, పూసం సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలి

కొనుగోలు పరిమితి పెంచాలి.. గోనె సంచులు ఇవ్వాలి

రైతు, కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి - ఉంగుటూరు



ధాన్యం కల్లాల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న కౌలు రైతులు

ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలని, కొనుగోలు పరిమితి పెంచాలని, రైతులకు గోనె సంచులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కైకరంలో ధాన్యం కల్లాల వద్ద ఎపి రైతుసంఘం, ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. కల్లాల వద్ద నుండే ధాన్యం సేకరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు రవాణా, హమాలీ ఛార్జీలు ముందుగా భరించి కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకురావాలని చెప్పడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం ఏ రైస్ మిల్లుకు వెళ్తుందో ముందు తెలియకపోవడంతో దూరంగా ఉండే మిల్లుకు తరలించే పరిస్థితి ఏర్పడి ట్రాక్టర్ల యజమానులు ధాన్యం రవాణాకు ముందుకు రావడం లేదన్నారు. కల్లాల నుండి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, రవాణా, హమాలీల ఏర్పాటు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే బాధ్యత తీసుకోవాలని కోరారు. రైతులకు గోనె సంచులు ఇవ్వాలన్నారు. ఎకరాకు 34 బస్తాలే కొనుగోలు చేయాలని కొనుగోలు పరిమితి విధించడం వల్ల ఆ పైన దిగుబడి వచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొనుగోలు పరిమితి 40 బస్తాలకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

19, 20వ తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభ



మాట్లాడుతున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 19వ తేదీ నుంచి సిఐటియు 12వ జిల్లా మహాసభ ఏలూరులో జరగనుందని, ఆ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.సోమయ్య, డిఎన్‌విడి.ప్రసాద్ కోరారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 20 సంవత్సరాల తర్వాత ఏలూరులో సిఐటియు జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభ గురించి నెల రోజులకుపైగా ఏలూరు నగరంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారని తెలిపారు. సిఐటియు జిల్లా మహాసభ ప్రతి మూడు సంవత్సరాలకోసారి జరుగుతున్నాయని, గత మూడేళ్లలో జరిగినటు వంటి ఉద్యమాలను సమీక్షించుకుని భవిష్యత్తులో జిల్లాలో కార్మికులు, ఉద్యోగులు, ప్రజల సమస్యలపై చేపట్టాల్సిన కర్తవ్యాలను ఈ మహాసభలో చర్చిస్తామని తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, కె.స్వరూపారాణి, ఆర్.నరసింహారావు, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లింగరాజు, నగర అధ్యక్షులు బి.జగన్నాథరావు, కార్యదర్శి వి.సాయిబాబు, నాయకులు జె.గోపి, ప్రశాంత్ పాల్గొన్నారు.

లంపి స్కిన్ వైరస్‌పై కదిలిన యంత్రాంగం

చొదిమెళ్లలో పర్యటించిన పశుసంవర్ధక శాఖాధికారులు

ప్రజాశక్తి - ఏలూరుటౌన్




పశువులను పరీక్షిస్తున్న అధికారులు

ఆవులకు లంపి స్కిన్ వైరస్ వ్యాప్తిపై జిల్లా అధికారులు కదిలారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లంపి స్కిన్ ప్రబలినట్లు అనుమానిస్తున్న ఆవులున్న చొదిమెళ్ల గ్రామంలో పశుసంవర్ధక శాఖాధికారులు పర్యటించారు. యానిమల్ డిసీజ్ డయోగ్నస్టిక్ లేబరేటరీ అధికారులతో స్థానిక విఎఎస్, సిబ్బందితో కలిసి చొదిమెళ్లలో పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు సందర్శించారు. అనుమానిత పశువుల నమూనాలను సేకరించి, నిర్ధారణ కోసం భోపాల్ పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే గ్రామంలోని పశువులకు సంబంధిత టీకాలు వేసి, అనుమానిత పశువులకు అవసరమైన చికిత్సను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. అవసరమైన చికిత్స అందించడానికి, ఎల్ఎస్‌డి పట్ల రైతుకు అవగాహన కల్పించడానికి గ్రామాన్ని క్రమం తప్పకుండా సందర్శిస్తూ చర్యలు తీసుకున్నామన్నారు.

ఐ కేర్ క్లినిక్ ప్రారంభం అభినందనీయం

కైకలూరు ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రజాశక్తి - కైకలూరు రూరల్




ఐ కేర్ క్లినిక్‌లో ఎంఎల్ఎ నాగేశ్వరరావు

కంటి వైద్యంలో విశేషానుభవం కలిగి.. రాష్ట్రంలోనే ఉత్తమ వైద్యునిగా పేరు తెచ్చుకున్న డాక్టర్ ఆళ్ల భాస్కరరెడ్డి కైకలూరు పట్టణంలో నూతన ఐ కేర్ క్లినిక్‌ను ప్రారంభించడం అభినందనీయమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు (డిఎన్ఆర్) అన్నారు. గురువారం కైకలూరు పట్టణంలో బృందావనం కాంప్లెక్స్‌లో సాయి శ్రీవల్లీ ఐ కేర్ సెంటర్‌ను ప్రజాప్రతినిధులతో కలిసి ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ డిఎన్ఆర్ మాట్లాడుతూ కైకలూరు పరిసరప్రాంత ప్రజలకు ఒక మంచి కంటి వైద్య నిపుణులు అందుబాటులోకి రావడం, ముఖ్యంగా స్థానిక కంటి వైద్య నిపుణులు డాక్టర్ జాన్ విక్టర్ బాబు రోజువారీ పర్యవేక్షణలో కంటి రోగులకు వైద్యసేవలు అందించడం చాలా సంతోషమని అన్నారు. తక్కువ ఫీజుతో నాణ్యమైన వైద్యం అందించే ఈ ఆసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జాన్ విక్టర్ బాబు ఎంఎల్ఎకు, జంపన రామలింగరాజుకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి కురెళ్ల బేబీ, జంపన పెద్దిరామరాజు, కూసంపూడి కనకదుర్గ, సర్పంచి నవరత్నకుమారి, గండికోట ఏసుబాబు, దుట్టా మణి, ఉలిసి వసంతకుమారి, జయమంగళ కాసులు, కూనవరపు సతీష్, ఘంటసాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నేత తాన్న రంగారావు మృతి

నివాళులుర్పించిన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు



సిపిఎం నగర కమిటీ మాజీ సభ్యులు, సీనియర్ నేత తాన్న రంగారావు (80) బుధవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన మృతి పట్ల సిపిఎం జిల్లా, నగర కమిటీలు సంతాపం తెలిపాయి. రంగారావు అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రంగారావు అంతిమయాత్ర చోడిదిబ్బలోని రంగారావు నివాసం నుండి అశోక్‌నగర్ శ్మశాన వాటిక వరకు సాగింది. అనంతరం అక్కడ జరిగిన సంస్మరణ సభకు సీనియర్ నాయకులు కంది విశ్వనాథం అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ తాన్న రంగారావు జ్యూట్‌మిల్లు కార్మికునిగా పని చేస్తూనే, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎంలో క్రియాశీల కార్యకర్తగా పని చేశారన్నారు. ఆయన భార్య తాన్న సింహాచలం కూడా మహిళా ఉద్యమంలో పనిచేసి రౌడీమూకల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. రంగారావు కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటున్నప్పటికీ ప్రజల కోసం పార్టీ చేస్తున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటూ ఉండేవారని అన్నారు. రంగారావుకు నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు బి.సోమయ్య, నాయకులు విశ్వనాథం, పి.ఆదిశేషు, వి సాయిబాబు, బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, ఎం.కనకారావు, జి.ఏసుబాబు, మీసాల సత్యం, స్థానిక పెద్దలు సింహాచలం, అల్లం వెంకటేశ్వరరావు, శేఖర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర, సీనియర్ నేతల సంతాపం

తాన్న రంగారావు మతి పట్ల పలువురు నేతలు సంతాపం తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఎ ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్), మహిళా ఉద్యమ నేత అల్లూరి మన్మోహన్ (అమ్మాజీ), సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, సీనియర్ నేత చింతకాయల బాబూరావు, సిఐటియు పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ఏలూరు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ తదితరులు రంగారావు మృతి పట్ల సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



డ్రోన్ సర్వేను ప్రారంభించిన కమిషనర్ భవానిప్రసాద్

మున్సిపాల్టీ మాస్టర్ ప్లాన్‌పై డ్రోన్ సర్వే

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణం మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు డ్రోన్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానిప్రసాద్ తెలిపారు. గురువారం డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆదేశానుసారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ న్యూఢిల్లీ వారిచే మాస్టర్ ప్లాన్ తయారీకి డ్రోన్ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ 2045 సంవత్సరం వరకు పెరగనున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని పట్టణంలో కమర్షియల్, ఇండస్ట్రియల్ జోన్‌లను, పార్కుల హద్దులను అభివృద్ధి చేయడానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి.జగదీశ్వరరావు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ ప్రతినిధి ఎం.ప్రసాద్, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.



నోటీసు అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

బకాయిల విడుదల కోరుతూ..

22న కలెక్టరేట్ వద్ద ధర్నా

కలెక్టరేట్ ఎఒకు నోటీసిచ్చిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎలు, సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఈ నెల 22న జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ నేతలు తెలిపారు. దీనికి సంబంధించిన నోటీసును గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పరిపాలనాధికారి బి.రమాదేవికి అందజేశారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పిఎఫ్ లోన్లు, ఫైనల్ పేమెంట్లకు సంబంధించి ఇప్పటి వరకూ దాదాపు రూ.30 కోట్లు గత ఏప్రిల్ నుంచి బకాయిలున్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని నోటీసులో కోరారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఎపిజిఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లకు సంబంధించి సుమారుగా రూ.20 కోట్ల బకాయిలున్నాయని, వాటిని కూడా విడుదల చేయాలని కోరారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఎరియర్లు, ఎర్న్‌డ్ లీవ్ బకాయిలు, జిఐఎస్ సంబంధించిన అటువంటి పెండింగ్ బకాయిలు సుమారుగా రూ.62 కోట్లు ఉన్నాయని, ఈ భాగాన్ని కూడా విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు, కోశాధికారి షేక్ ముస్తఫాలీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విబివిఎస్.సుబ్రహ్మణ్యం, పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, కోశాధికారి సిహెచ్.పట్టాభి రామయ్య పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎస్ఇ శ్యాంబాబు

కాలనీ ఇళ్లకు త్వరితగతిన విద్యుత్ కనెక్షన్లు

ఎస్ఇ శ్యాంబాబు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జగనన్న కాలనీ ఇళ్లకు విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు త్వరితగతిన అందిస్తున్నామని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ శ్యాంబాబు తెలిపారు. గురువారం మండలంలోని లక్కవరం, తాడువాయి గ్రామాల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో స్తంభాలు, వీధి దీపాలు, ఇళ్లకు మీటర్ల బిగింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు. జగనన్న లేఅవుట్లలో విద్యుత్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా చింతలపూడి నియోజకర్గంలో లక్కవరం, తాడువాయి కాలనీలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

గోనె సంచులకు ఎటువంటి కొరతా లేదు

ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోనె సంచులకు ఎటువంటి కొరతా లేదని ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్ చెప్పారు. దీనిపై రైతులు ఎటువంటి కంగారూ పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం ఉంగుటూరులో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులతో ధాన్యం కొనుగోలుపై మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు గోనె సంచులు, లారీలు మరింత ఎక్కువ కావాలని కోరారు. దీనిపై ఆర్‌డిఒ స్పందిస్తూ ఉంగుటూరు మండలంలో మూడు సొసైటీలకు బుధవారం వరకు లక్షా 17 వేల గోనె సంచులు అందించామన్నారు. గురువారం మరో 50 వేలు గోనె సంచులు సరఫరా చేయగా రాత్రికల్లా లక్ష గోనె సంచులు సిద్ధం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. గోనె సంచుల ఇబ్బంది లేకుండా రెవెన్యూ, వ్యవసాయశాఖ రైస్‌మిల్లర్ల ద్వారా తెప్పిస్తున్నాయన్నారు. లారీలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో ఇంతవరకు 4,600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. ఈ విషయంలో ఆయా మండలాలకు ప్రత్యేక అధికారులను కలెక్టర్ నియమించారని తెలిపారు. ఆయన తహశీల్దార్ ఎవి.రమణరావు, సిఎస్ డిటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై 22న ధర్నా : యుటిఎఫ్

ప్రజాశక్తి - చింతలపూడి

పిఎఫ్, పెన్షన్ బకాయిలు, మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లుల బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 22వ తేదీన యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ప్రజాశక్తితో మాట్లాడారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవి.అప్పారావు మాట్లాడుతూ పిల్లల చదువుల కోసం దాచుకున్న డబ్బులు కూడా ఇవ్వకుండా ఉపాధ్యాయులను మానసికంగా వేధించడం తగదన్నారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పిఎఫ్, ఎపిజిఎల్ఐ మెడికల్ బిల్లులు రూ.1600 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు బి.శేఖర్ మాట్లాడుతూ రుణాలకు దరఖాస్తు చేసుకున్న సంవత్సరాలైనా కూడా రాకపోవడం గతంలో ఎప్పుడూ లేదన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి దామోదర్ మాట్లాడుతూ 22వ తేదీన నిర్వహించే ధర్నాలో అధిక సంఖ్యలో యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలు అమలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధి విధానాలు ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తున్నామని నగర కమిషనర్ షేక్ షాహిద్ తెలిపారు. స్థానిక పోణంగి డంపింగ్ యార్డును సంబంధిత అధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ క్లీన్ ఏలూరు కార్యక్రమం నిర్వహణ చేపట్టి పర్యావరణ పరిరక్షణకు తగు చర్యలు చేపట్టామన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు చేతి గ్లౌజులు, మాస్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆధునీకరించిన వర్మి కంపోస్ట్ కేంద్రాలను, సీసీ కెమెరాల పర్యవేక్షణను కమిషనర్ షాహిద్ పరిశీలించారు.

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు మౌనిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 14వ డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ వారి ఆధ్వర్యంలో రాజమండ్రిలోని జిఎస్ఎల్ మెడికల్ కళాశాలలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల ఎంపికలో స్థానిక సెయింట్ జోసెఫ్ దంత కళాశాల విద్యార్థిని కె.మౌనిక సౌత్ జోన్ టోర్నమెంట్‌కి ఎంపికైనట్లు కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఫాదర్ జి.మోజెస్ తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు బెంగళూరులోని జైన్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు తమ కళాశాల విద్యార్థిని ఎంపికైందని తెలిపారు. ఆమె ఈ నెల 18న సిద్ధార్థ మెడికల్ కళాశాలలో నిర్వహించే శిక్షణలో పాల్గొంటుందని కళాశాల ప్రిన్సిపల్ ఎన్.శ్రీధరరావు తెలిపారు.

సహకార పరపతి సంఘాలు అభివృద్ధి చెందాలి

జంగారెడ్డిగూడెం : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు మరింత అభివృద్ధి చెందాలని పిఏసిఎస్ జిల్లా ఆడిట్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం 69వ అఖిలభారత ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వారోత్సవాల సందర్భంగా స్థానిక పిఏసిఎస్ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ వందనపు వెంకటేశ్వరరావు జెండా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆడిట్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డివిజన్ అధికారి జి.వెంకటేశ్వరరావు, మండల అధికారి నజీమ్, పోలవరం సబ్ డివిజన్ అధికారి సాయిబాబా, డైరెక్టర్లు నరసింహారావు, ఎ.రాధ, పోలవరం సబ్ డివిజన్ పరిధిలోని సహకార సంఘాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా నూతన కమిటీ ఎన్నిక

జీలుగుమిల్లి : మండలంలోని రౌతుగూడెంలో సిపిఐఎంఎల్ డివిజన్ స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా నూతన కమిటీని 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కన్వీనర్ ఎస్.కె.గౌస్ తెలిపారు. కన్వీనర్‌గా కట్ల ముత్యాలరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రైతు సమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు. నిర్వాసిత కాలనీల్లో సమస్యలను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవి, రంగమ్మ, సూర్యనారాయణ, కామరాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో కార్తీక్‌కు 3 స్వర్ణ పతకాలు

జంగారెడ్డిగూడెం : పట్టణంలో వికాస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భవనీ కార్తీక్ మూడు స్వర్ణ పతకాలు సాధించాడు. అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో ఈ నెల 11వ తేదీ నుంచి 13 వరకు నిర్వహించిన 22వ జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ జూనియర్ విభాగం పోటీల్లో పాల్గొని మూడు స్వర్ణ పతకాలు సాధించాడు. 2020 సంవత్సరంలో నిర్వహించాల్సిన పోటీలను కోవిడ్ కారణంగా 2021లో బెంగుళూరులో నిర్వహించారు. ఆ జాతీయ స్థాయి స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో రెండు గోల్డ్ మెడల్స్, 2021లో ఉదయపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఛాంపియన్ షిప్ పోటీల్లో మూడు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు భవనీ కార్తీక్ తండ్రి బుదిరెన నాగేంద్ర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా భవనీ కార్తీక్‌ను పలువురు అభినందించారు.

డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పూర్తి

ఉంగుటూరు : నారాయణపురం శ్రీ అరవింద ప్రభుత్వ కళాశాల డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థులకు రెండు నెలల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం పూర్తయిందని కళాశాల ప్రిన్సిపల్, డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు తెలిపారు. నూతన విద్యా విధానంలో భాగంగా కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్, ఇంటర్న్ షిప్ ట్రైనింగ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పారు. రెండు నెలల ఇంటర్న్ షిప్‌లో వైద్యులుగా విద్యార్థులకు నేర్పించిన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వర్మ, డాక్టర్ శ్రావణిరెడ్డి, హేతేశ్వర్ రమణారావు, ఎంపిడిఓ ఎ.ప్రేమాన్విత, నారాయణపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షులు పాపారావు బాబ్జి, ఆర్ఎస్ పాలిమర్స్ అధినేత మనోజ్ సోన్వార్‌లకు కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేసి కళాశాల తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు.

చెత్త సేకరణ రిక్షాలు అందజేత

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

మండలంలోని పలు పంచాయతీలకు 24 చెత్త సేకరణ రిక్షాలను ఎంఎల్‌ఏ దూలం నాగేశ్వరరావు గురువారం అందించారు. ఎంపిపి అడివి కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా తయారీ స్థావరంపై దాడులు నిర్వహించినట్లు చింతలపూడి సిఐ మల్లేశ్వరరావు తెలిపారు. జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, అదనపు ఎస్‌పి ఆపరేషన్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి కె.చక్రవర్తి ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఇన్‌ఛార్జి డిఎస్‌పి కెవి.సత్యనారాయణ ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో పాయమ్మ చెరువు కాలువ వద్ద నాటుసారా దాడులు చేశారు. ఈ దాడిలో 50 లీటర్ల నాటుసారా, ఆరు ప్లాస్టిక్ డ్రమ్ములు, గ్యాస్ సిలిండర్లు, ఒక గ్యాస్ స్టవ్, సారా తయారీకి ఉపయోగించే సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. 1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు.

అక్రమంగా గోవుల తరలింపు : ఇద్దరు అరెస్టు

జీలుగుమిల్లి : అనుమతులు లేకుండా పది ఆవు గిత్తలను తెలంగాణకు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. రాజమండ్రి నుంచి తెలంగాణ రాష్ట్రానికి అనుమతులు లేకుండా ఆవు గిత్తలను తరలిస్తుండగా స్థానిక విఆర్‌ఓ ఫిర్యాదు మేరకు మండలంలోని తాటియాకులగూడెం సమీపంలో జాతీయ రహదారిపై తనిఖీ చేసి పట్టుకున్నట్లు చెప్పారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గోగులంపాడులో చెరకు తోట దగ్ధం

ముసునూరు : చెరకు తోట దగ్ధమైన ఘటన మండలంలోని చింతలపల్లి శివారు గోగులంపాడులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చింతలపల్లి, గోగులంపాడు గ్రామాలకు చెందిన పలువురు రైతులు గోగులంపాడులో చెరకు తోటలను సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం వేళ మంటలు రావడంతో గమనించిన స్థానిక రైతులు అగ్నిమాపక సిబ్బందికి, రైతులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే సుమారు రైతులకు చెందిన రెండు ఎకరాల వరకు పంట దగ్ధమైంది.

నివాసితులకు నష్టపరిహారం అందిస్తాం

ఇళ్లస్థలాల్లో మార్కింగ్‌లు, రోడ్డు మ్యాప్ పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి కథనాలకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

పామర్రు-కత్తిపూడి 165 జాతీయ రహదారి విస్తరణ పనులు మండలంలోని పెదపాలపర్రు నుంచి దాకారం గ్రామం వరకు 14 కిలో మీటర్ల మేర జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల 30 మీటర్లల్లో రోడ్డు విస్తరణ చేయాలనే ఉద్దేశంతో నివాసితులకు సమాచారం ఇవ్వకుండా, పరిహారం చెల్లించకుండా తొలగించేందుకు అధికారులు ప్రయత్నించారు. దీంతో ప్రజాశక్తి వరుసగా మూడు కథనాలు ప్రచురించడంతో నేషనల్ హైవే అధికారులు స్పందించారు. గురువారం విజయవాడ నుంచి డిఇఇ, ఎఇఇలు అంబేద్కర్ కాలనీలో క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా నివాసితులతో మాట్లాడారు. ఎటువంటి ఇబ్బంది ఉండదని, తమకు సహకరించాలని అధికారులు కోరారు. నివాసితుల ఇళ్ల దగ్గరకు వెళ్లి మార్కింగ్ ఇచ్చిన ప్రాంతాల్లో క్షుణంగా పరిశీలించారు. రోడ్డు పక్కన ఉన్న దుకాణాలు తొలగించేందుకు సహకారం అందించాలని గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మను కోరారు. సర్వేయర్లకు పలు సూచనలు చేశారు.

తహశీల్దార్ నివేదిక ప్రకారం పరిహారం

రోడ్డు విస్తరణలో నష్టపోయిన నివాసితులు పేర్ల వారీగా తహశీల్దార్ కె.శ్రీనివాస్ ఇచ్చిన నివేదిక ప్రకారం నష్టపరిహారం ఇస్తామని నివాసితులకు డిఇఇ ఎం.సత్యనారాయణరావు తెలిపారు. మండలంలోని పెదపాలపరు సెంటర్‌లో ముదినేపల్లి సెంటర్‌లో నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ జరుగుతుందన్నారు. పట్టాదారు భూముల రైతులకు గతంలో నష్ట పరిహారం చెల్లించామన్నారు. రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరిగేందుకు దుకాణదారులు, రైతులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.


ఇళ్ల స్థలాల్లో మార్కింగ్‌లు పరిశీలిస్తున్న డిఇఇ

మరోసారి నివేదిక సిద్ధం చేస్తున్నాం
తహశీల్దార్ కె.శ్రీనివాస్

జిల్లాల విభజన జరగకముందు కృష్ణాజిల్లా కలెక్టర్‌కు రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోయిన నివాసితులకు పరిహారం అందించాలని నివేదిక సమర్పించామన్నారు. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో మండలం చేరిందన్నారు. మరోసారి నివేదిక తయారు చేస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు మార్జిన్‌లో ఉన్న నివాసితులు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తాం. సర్వేయర్‌తో మరోసారి సర్వే చేసి ప్రభుత్వం ఇచ్చినటువంటి భూముల్లో పట్టాదారు ఉంటున్నారా లేదా, సర్వే చేసి తుది నివేదిక సిద్ధం చేయాల్సిఉంది. దానిని బట్టి నివాసితులకు నష్ట పరిహారం అందిస్తాం.

నేడు దెందులూరు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - దెందులూరు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మండల అధ్యక్షులు బి సుమలత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎబిపివి.లక్ష్మి తెలిపారు.

టెలీ మెడిసిన్ హబ్‌లో ఉద్యోగాల భర్తీ : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జాతీయ ఆరోగ్య మిషన్, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లోని టెలీ మెడిసిన్ హబ్‌లో ఉద్యోగాల భర్తీ కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఎం మిషన్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో టెలీ మెడిసిన్ హబ్‌లో ఉద్యోగాల భర్తీకి ధరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలోని స్పెషల్ మెడికల్ ఆఫీసర్ పిడియాట్రిషియన్ పోస్టుకు నెలకు రూ.లక్ష గౌరవ వేతనం అందించనున్నట్లు తెలిపారు. ఇందుకు ఎంబిబిఎస్(డిసిహెచ్)/ఎండి పిడియాట్రిక్స్ ఎపి మెడికల్ కౌన్సిల్‌లో రిజిష్టరు అయిన దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏలూరు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో, తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక మెడికల్ ఆఫీసర్ ఫిజీషియన్ 2 పోస్టుల భర్తీకి ఎండి(జనరల్ మెడిసన్) ఎపి మెడికల్ కౌన్సిల్ లోరిజిష్టరు అయి ఉండాలన్నారు. వీరికి నెలకు రూ.లక్ష గౌరవ వేతనంగా నిర్ణయించినట్లు చెప్పారు. ఏలూరు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో, తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో రెండేసి చొప్పున నలుగురు మెడికల్ ఆఫీసర్ల నియామకానికి ఎంబిబిఎస్ అర్హత కలిగి ఎపి మెడికల్ కౌన్సిల్‌లో రిజిష్టరు అయి ఉండాలన్నారు. వీరికి నెలకు రూ.53 వేల గౌరవ వేతనంగా చెప్పారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హతలకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్స్, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, తాజ కుల ధ్రువీకరణ పత్రం, గజిటెడ్ అధికారి వారిచే ధ్రువీకరించిన ఒక జిరాక్స్ సెట్‌తో ఏలూరులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు https://westgodavari.ap.gov.in, https://eluru.ap.gov.in వెబ్ సైట్‌లను సందర్శించాలని తెలిపారు.

నా భర్త నుంచి రక్షణ కల్పించండి

బాధిత మహిళ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

తనను అంతమొందించేందుకు ప్రయత్నిస్తున్న తన భర్త నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఓ మహిళ కుటుంబ సభ్యులతో గురువారం ధర్నాకు దిగింది. పెదవేగి మండలం విజయరాయి గ్రామానికి చెందిన పామర్తి శివమ్మకు 2003లో 221/6 సర్వే నెంబర్‌లోని ఫ్లాట్ నెంబర్ 84లో ప్రభుత్వం 96 గజాల స్థలాన్ని కేటాయించింది. కొన్ని సంవత్సరాలుగా భర్త పామర్తి భాస్కర్‌రావుతో ఉన్న తగాదాల కారణంగా 2018లో ఇరువురు విడిపోయారు. అప్పటినుంచి శివమ్మ తన కుమారుడు రాజేష్‌తో కలిసి అదే స్థలంలో చిన్నపాటి గుడిసె వేసుకొని జీవిస్తుంది. ఈ నేపథ్యంలో ఎలాగైనా స్థలం కబ్జా చేయాలనే దురుద్దేశంతో భాస్కర్‌రావు ఆ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి శివమ్మపై దాడి చేశాడు. అంతేకాకుండా ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు శివమ్మను హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆమె ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు మొర పెట్టుకున్నానని, తనకు భాస్కరరావు నుంచి ప్రాణహాని ఉన్న కారణంగా తనకు రక్షణ కల్పించాలని శివమ్మ వేడుకుంటుంది. తన స్థలాన్ని తనకు ఇప్పించి న్యాయం చేసి తనను హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్న భాస్కరరావు, అతని కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతుంది.

కవులు, రచయితల గురించి తెలుసుకోవాలి


భీమడోలు మండలంలో..

ప్రజాశక్తి - దెందులూరు

పోతునూరు శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం కవి సమ్మేళనం, సెమినార్లు, రచయితల సందేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రూపవత్ రంగయ్య, తెలుగు ఉపాధ్యాయులు పి.ఆంజనేయస్వామి, హిందీ ఉపాధ్యాయులు బి.ఉమామహేశ్వరరావు, ఎంపిహెచ్ఒ టి.శ్రీనివాసబాబు, ఎఎన్ఎం కె.అరుణకుమారి పాల్గొని పలువురు కవుల పద్యాలను వినిపించారు. అక్షర సంపదతో ఎవరైనా రచయితలుగా మారవచ్చని చెప్పారు. పోతునూరు గ్రామంలోని కవులు, రచయితల గురించి విద్యార్థులకు తెలిపారు. అనంతరం 8, 9 తరగతుల విద్యార్థులకు గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యత గురించి వక్తృత్వ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్‌బాబు పాల్గొన్నారు.

భీమడోలు : గ్రంథాలయాల సేవలు వినియోగించుకోవాలని గుండుగొలను గ్రామపంచాయతీ కార్యదర్శి వి.మురళీకృష్ణ కోరారు. గుండుగొలనులో గ్రంథ పాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో అంబేద్కర్, జాతీయ పుష్పం, తామర పువ్వు అంశాలుగా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పూళ్లలో గ్రంథ పాలకులు డిఎన్‌బి.అమర్‌నాథ్ ఆధ్వర్యంలో తెలుగు పద్యాల పఠనం పోటీలు, సీనియర్ జూనియర్ విభాగాల వారీగా చదరంగం పోటీలు నిర్వహించారు. భీమడోలులో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీ నిర్వహించారు. కవి సమ్మేళనం చేపట్టారు. కవులను సత్కరించారు. వివిధ అంశాలపై ప్రముఖులతో చర్చా గోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు టివి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రు శాఖ గ్రంథాలయంలో గురువారం కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సాగిరాజు జానకిరామరాజు, ఇంటి ఉదయ భాస్కర్, శానం శ్రీనివాస్, గ్రంథాలయ అధికారి బాలరాజు పాల్గొన్నారు.


గణపవరం : గణపవరం గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు నరసమ్మ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ఎన్.సుభాషిణి, జి.సుబ్బారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

పండించిన పంటను రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్ముకుంటే గిట్టుబాటు ధర వస్తుందని కోర్లగుంట సర్పంచి నక్కనబోయిన సత్యనారాయణ అన్నారు. మండలంలోని వలసపల్లి, కోర్లగుంట గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ దాసరి సుధ, మండల వ్యవసాయ అధికారి కె.చినసూరిబాబు ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు సుందరరావు, సీనియర్ అసిస్టెంట్ డివిబి.చంద్రశేఖర్‌రావు, చింతలపల్లి సర్పంచి పిల్లి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు నాగళ్ల వెంకటేశ్వరరావు, ఎంపిఇఒలు ఎ.ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు, పి.సుధీర్ పాల్గొన్నారు.

గణపవరం : మండలంలోని జల్లి కాకినాడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచి బాతు నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం, సొసైటీలు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. దళారుల వల్ల ఇబ్బందులు లేకుండా ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తుందని చెప్పారు. స్థానిక రైతు మల్లుల శ్రీనివాస్ దగ్గర విఆర్ఒ వర్మ సమక్షంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్లు చెప్పారు.


కోర్లగుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు,అధికారులు

లబ్ధిదారులకు సత్వరమే బిల్లులు

ఉంగుటూరు : జగనన్న గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకునే వారికి బిల్లులు త్వరితగతిన ఇస్తున్నామని, డ్వాక్రా రుణాలు కూడా అందిస్తున్నామని తహశీల్దార్ ఎవి.రమణరావు అన్నారు. గోపీనాథపట్నం సచివాలయం వద్ద గురువారం లబ్ధిదారులకు అవగాహనా సదస్సు సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఇళ్లు కట్టుకునేవారికి ప్రభుత్వ పరంగా అన్నివిధాలా సాయం అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హౌసింగ్ ఎఇ సురేష్ మాట్లాడుతూ ఈ గ్రామంలో 67 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వగా అందులో 35 మందికి శాంక్షన్ వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రేమాన్విత, ఎపిఎం పద్మావతి, గ్రేడ్-5 కార్యదర్శి నాగ బ్రహ్మానందరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలి : టిడిపి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని శ్రీనివాసపురం అక్కంపేట రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దాసరి శ్యాంచంద్ర శేషు డిమాండ్ చేశారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు అధ్యక్షతన అక్కంపేట గ్రామంలో గురువారం బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి శ్యామ్ చంద్ర శేషు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధిలో వైసిపి విఫలమైందన్నారు.

అవయవ దానం ఎంతో గొప్పది

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మరణానంతరం తమ శరీరం పదిమందికి ఉపయోగపడాలనే ఆలోచన చాలా మంచిదని అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అనాటమి విభాగపు అధిపతి పి.బాపూజీ అన్నారు. తడికలపూడికి చెందిన ఉపాధ్యాయులు మద్రి సుధాకరరావు, ఆయన భార్య మద్రి అలివేలు మంగకుమారి మరణానంతరం తమ శరీరాలను ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాలకు దానం ఇచ్చారు. వారు సంతకాలు చేసిన పత్రాలను ఇతర న్యాయ సంబంధిత లాంఛనాలను పూర్తి చేసి న్యాయవాది గుంటూరు బాబు గణేష్ ఆశ్రమం కళాశాల అనాటమీ విభాగపు అధిపతి పి.బాపూజీకి గురువారం అందించారు. ఈ సందర్భంగా పి.బాపూజీ మాట్లాడుతూ ఉపాధ్యాయులైన మద్రి సుధాకరరావు, అలివేలు మంగకుమారి తమ శరీరాలను మరణానంతరం దానం చేయడం హర్షనీయమన్నారు. న్యాయ సంబంధిత లాంఛనాలను పూర్తి చేసి పత్రాలు అందించినందుకు న్యాయవాది గుంటూరు బాబు గణేష్‌ను అభినందించారు.

కొయ్యలగూడెంలో విద్యుత్ క్రమబద్ధీకరణ పనులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

విద్యుత్ శాఖ అధికారులు స్పందించడంతో దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించింది. పరింపూడి పంచాయతీ పరిధిలో గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో టాయిలెట్స్ నిర్మాణ పనులు ఎంఎల్ఎ సహకారంతో రూ.40 లక్షల నిధులతో చేపట్టగా ఆ ప్రదేశంపై నుంచి ఎలక్ట్రికల్ వైర్లు వెళ్లాయి. విషయం సర్పంచి ముప్పిడి విజయకుమారి దృష్టికి తీసుకెళ్లగా సర్పంచి విద్యుత్ శాఖ అధికారులతో చర్చించారు. దీంతో వెంటనే విద్యుత్ వైర్లు క్రమబద్ధీకరించి టాయిలెట్స్ నిర్మాణానికి కరెంట్ వైర్లు అడ్డు లేకుండా చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ పాలకవర్గం ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.